# "మురికి"

వి. రాజారామమోహన్ రావు

ఆ పెద్ద చెరువుదగ్గర ఆ మురికికాలువ కొంచెంకిందకి పాకుతుంది. అంత వరకు తనతో బరువుగా తెచ్చుకున్న బురదని అక్కడ వదిలేయాలని మరీ తొందరగా పారుతుంది. ఆ తొందరలో గట్టుమీద కూచుని పిల్లలు విసిరే చిన్నచిన్న పెంకుల్ని, రాళ్ళనికూడా కొంతదూరం మోసుకు పోతుంది.

అలా...రాళ్ళు విసిరే ఆ పిల్లలకి అది కుళ్ళని, ఆ కుళ్ళు చుట్టూ ఉండే వాసన వాళ్ళకి తెలియకుండానే వాళ్ళల్లోకి చేరుతోందని తెలియదు. ఇంకా....

ఆ పిల్లల తల్లులు, తండ్రులు, బామ్మలు, మామ్మలు. వాళ్ళలో కొందరికి తమచుట్టూ మురికుందని అదే తమ బతుకుల్ని పాడు చేస్తోందని తెలుసు. మరికొందరికి మురికి ఉందని మాత్రమే తెలుసు.

అందరికీ అలవాటయి పోయింది ఆ కుళ్ళు. ఆ వాసన వాళ్ళ ఊపిరిలాగే సహజమైపోయింది. అప్పుడప్పుడు ఆ వాసన మరీ బలంగా చెలరేగినప్పుడు ఓసారి ఆ వాసనకి గుడ్డపెట్టుకుని మళ్ళీ తర్వాత తీసేసి...

మురికి కాలవగట్టు మీదున్న ఆ పాకలన్నింటికీ రోజు అలాగే గడుస్తోంది చాలా రోజుల్నుంచి.

ఆ వేపనుంచి తూములో దూరి వచ్చిబడిన గాలి, కాలవమీద తేలి, ప్రతి రోజూ ఏదో సమయంలో ఆ పాకల్ని పలకరించి విశేషాలడుగుతుంది.

చీకి, చివికిపోయి....తమమీద బలంగా పేరుకున్న దుమ్ము బలంతో నిలబడ్డ ఆ పాక కప్పులు ఆ నాటి విశేషాలు చెప్తాయి ఆ మురికి గాలికి.

జబ్బుగా ఉన్న ఆ పాకలోకి జబ్బుకు భయపడి పిరిగ్గా, మెల్లిగా దూరింది మురిగాలి.

ముడుచుకుని ఇసికలో ఎండుకొబ్బరాకులా పడుకునుంది చాపమీద ముసల్ది.
"మందు తెచ్చినా తాగవే" అన్నాడు ఆ చాప ఓ చివర్నించి రాములు.

మెత్తగా వీపుమీద లచ్చి గుండెలు....ఆ స్పర్శ గుర్తు తెస్తోంది....ఆ నాడు కూడా చెప్పలేక చెప్పలేక చెప్పింది...'పరవాణ్ణం' తినాలని ఉందని లచ్చి.

ఎంత పండుగకైనా ఒక్క పూటకి మూడు రూపాయిలు ఖర్చుంటే...చేయాలన్నా ఏదీ...లేదు

ఆ గాఢ అప్పలసామి శరీరాన్ని, మనసుని, నరాల్ని, యవ్వనాన్ని అల నటలా పట్టుకుంది.

పెద్దతూము దగ్గర నిలబడ్డాడు నరసింహం. ఆ కుళ్ళు కాలవ చప్పుడు వాసన తెస్తూనే ఉన్నాయి. ఆ దుర్వాసన ఊపిరితో పాటు లోపలికి పాకి మెదడంతా ఆలోచనతో కలగలిసి తిరుగుతోంది.

ఆ కుళ్ళుచేసే చెడు తెలుసు. ఆ కుళ్ళులోంచి వచ్చి పట్టుకుని పీడించే క్రిముల గురించి తెలుసు.

పారిపోవాలనుంది నరసింహానికి దాన్నించి దూరంగా. కాని అతనికాళ్ళు కదలవు. ఎవరి కోసం ఎదురు చూస్తున్నాడో వాళ్ళు వచ్చేవరకు. ఆ కాళ్ళల్లో స్వతంత్రంగా కదిలే బలాన్ని అతనిలో రాగలిగే మార్పుని గుత్తాగా కొనేశారు ఏనాడో.

కోఆపరేటివ్ సొసైటీ లో గుమాస్తా అన్న పేరుమీద అతనికి నెలసరి జీతం ఇస్తున్నా, అది అతని ఉద్యోగానికి కాదు. అతనిలో వాళ్ళు ప్రవేశ పెట్టిన బానిసత్వానికి.

దాని మూలాన్నే అక్కడనుంచి వెళ్ళిపోవాలని ఉన్నా, వెళ్ళకుండా నిలబడి ఆ వాసనని అలవాటు చేసుకోవాలని తాపత్రయ పడుతున్నాడు నరసింహం....ఆ ప్రయత్నంలోనే.

చేతిలో మధ్యకి మడిచి పెట్టిన అరతావు సైజు కాయితాల్ని విప్పాడు,
కాలవ పక్కన పాకల ఓట్ల జాబితా...
అసువుల రాములు —30 సం॥
.... .... ....—51 ,,
.... .... ....—28 ,,

| | | |
|---|---|---|
| .... .... .... | —56 | ,, |
| పీదిగుల వెంకన్న | —45 | ,, |
| .... .... .... | —23 | ,, |
| .... .... .... | —39 | ,, |
| మదిరి అప్పలసామి | —25 | ,, |
| మదిరి లచ్చిమి | —23 | ,, |

ఆ కాయితాల్లోంచి మురికి ఇంకా బలంగా లేచి తన ముఖం మొత్తా కమ్ముకున్నట్టయింది నరసింహానికి.

చేతిలో ఉన్న కాయితాల మీద చిరాగ్గా ఉంది. ఆ మురికిక్కి దగ్గరగా తన్నీడ్చి నందుకు నరిసింహానికి.

'చేయాలి తప్పదు. బతకలేక చితుకుతున్న తను, వొంట్లో ఆడతనం ఎండిపోయి, నేను నీ పెళ్ళాన్నిసుమా అంటూ గుర్తుతెచ్చే పెళ్ళాం, నలుగురు పిల్లలు బతికే కాలత బతుక్కోసం చెయ్యాలి.... ఆ నెలసరి జీతంకోసం...

తనింతగా తను నాశన మయ్యేవి, ఆత్మాభిమానాన్ని, ఉద్దేశాల్ని, ఆలోచనల్ని, ముందుమీద తనకున్న ఆశల్ని చంపేసే చాలా పనులు చేశాడు....చేయించారు...ఇదివరకు....బతుక్కోసం చేశాడు..

కాని ఇది....తన వరకేకాదు. ఇతర్లని మురికిలోకి లాగే ఈ పని చేయక తప్ప నందుకు మరీ అసహనంగా ఉంది.

* * * *

అన్ని పాకల్లోనూ ఇంచుమించు ఒకేలా జరిగింది తంతు...

మంచేమిటో చెడేమిటో తెలియని ఆ మురికి బట్టలవాళ్ళకి, ఇదేమంచిదని, దీనివల్లే గొప్ప లాభమని నొక్కిచెప్పారు నలుగురు తెల్లబట్టల వాళ్ళు....ఈ మురికిలోకి. ఈ ఇరుకులోకి మీకోసం, మీ సుఖం కోసమే పనిగట్టుకు వచ్చామని మరీ మరీ చెప్పారు.

వాళ్ళవెనక నంగి నంగిగా నిలబడక తప్పలేదు నరసింహానికి జాబితాలో పేర్లు చెప్పుతూ.

ఎలక్షన్ పాంప్లెట్ తీసి, అందులో ఉన్న గుర్తుల్ని చూడండని....వాళ్ళు చూస్తుంటే....ఇదిగో పైనుంచి మూడోది, కిందనుంచి నాలుగోది...సరిగ్గా చూడండి ఈ గుర్తే మంచంటే, అని విశదంగా చెప్పటం నరిసింహం పని.

కరెన్సీ కట్టలోంచి ఒక్కోనోటే తీసి, జాబితా ప్రకారం వాళ్ళకివ్వటం ఓత్తెల బట్టల రాయుడు పని.

అసుపుల రాములు అందుకున్నాడు రెండు నోట్లని...

అవి తీసుకుంటున్నప్పుడు వాడి దృష్టిలో మంచి....చెడూ లేదు...వోటు, ఎలక్షనూ లేదు. తల్లికిప్పించాలి అనుకున్న సూదిమందుంది...వాడికళ్ళు మెరిశాయి అందులో కృతజ్ఞతని ఓ తెల్లబట్టల రాయుడు రెండు వోట్ల కింద లెఖ్ఖేసు కున్నాడు.

పిడిగుల వెంకన్నా తీసుకున్నాడు నోట్లని.

'విరిగితే విరిగిందిలే రిక్షా. దేముళ్ళల్లా వచ్చారు, పిల్లాడి చదువుకోసం అన్నట్టు ఆ పెట్టెలో ఆళ్ళు చెప్పిన గుర్తేసి కాయితం వేయటమేగా...' అనిపించింది అతి మామూలు విషయంలా.

వచ్చి వాళ్ళెదురుగుండానే కొడుక్కి బడిఫీజు కట్టమని ఇచ్చేశాడు నోట్లని.

అప్పలసామి వాళ్ళు వచ్చి వెళ్ళిపోగానే లచ్చిని చూశాడు చిలిపిగా...వాడిలో యవ్వనం కరిలినట్టయింది లచ్చి సిగ్గుచూసి. దాన్ని దగ్గరగా పొదువుకుని పాక కప్పు కేసి తృప్తిగా చూశాడు...

వీటన్నిటినీ చూసిన నరసింహం చేతిలోనూ పెట్టారు కొన్ని నోట్లని ఆ పాక లన్నీ తిరగటం అయిన తర్వాత...

నరిసింహాన్ని ఆ పెద్దతూము దగ్గర వొదిలేసి ఆ నలుగురూ వెళ్ళిపోయారు కారెక్కి.

చేతిలో ఉన్న లిస్టు చూశాడు నరిసింహం...
అసుపుల రాములు...వెంకన్న...అప్పన్న...ఎల్లయ్య...మల్లన్న...
"తెలియదు...వీళ్ళెవరికీ తెలియదు" గొణుక్కున్నాడు నరిసింహం.

పాకల్లో వాళ్ళకి, మేడల్లో వాళ్ళకి, అడుక్కునే వాళ్ళకి...అందరికీ ఓటెయ్యమని చెప్పిన తెల్ల రాయుళ్ళల్లో ఎవరూ చెప్పలేదు నరసింహానికి.

మనతొత్తే వాడు మనకి వెయ్యక ఏం చేస్తాళ్ళే అనే ధీమా. మన దగ్గర బతుక్కోసం పడున్న వాడికి వోటు విషయంలో వేరే ఉద్దేశం ఏముంటుందన్న నమ్మకం.

రాములు తల్లికి చెపుతున్నాడు, ఆడాళ్ళ వేపు లైన్లో నిలబెట్టి ఏ గుర్తుకి వెయ్యాలో...

"నీ యిష్టం...నువ్వేది సెబితే...అదే" అంది ముసల్ది.
లచ్చి ముసిముసిగా నవ్వుతోంది మొగాళ్ళ లైన్లో అప్పలసామిని చూసి.
వెంకన్న రిక్షాలో హుషారుగా మోసుకొస్తున్నాడు వోటర్లని.

చుట్టూ చూశాడు నరసింహం.... మందలా ఉన్నారు జనం... గొర్రెల మందలా కలగాపులగంగా....

ఎదురుగా పెట్టె....చేతిలో ఓటు. పరీక్షగా చూశాడు నరసింహం... అన్నీ గుర్తులే....అన్ని గుర్తులూ ఒకేలా కనిపించాయి....

'ఈ కాయితం మీద పైనుంచి మూడోది....కిందనుంచి నాలుగోది....జాగ్రత్తగా మడిచి' ఆ మాటలు కాలవకుళ్ళు కంపుతో కలగలిసి వినపడ్డాయి నరసింహానికి.

వాళ్ళకి తెలియదు....వాళ్ళ దృష్టిలో ఇది ఉట్టికాయితం. ఓ నోటు తెచ్చి పెట్టిన కాయితం....

రాములు తల్లికి సూదిమందు....వెంకన్న కొడుక్కి బడిఫీజు....అప్పలసామికి పాక అద్ది....తాత్కాలికంగా సంపాదించి పెట్టిన కాయితం....

అంతే దాని విలువ, అంతే వాళ్ళ దృష్టికి....

అదే జీవితాన్ని నిలబెట్టే నిత్యావసరాన్ని సంఘంలో అందరికి సమంగా కూర్చే శక్తని తెలియదు—ఆ శక్తితోటే మనిషిని మనిషి దోచుకోవటం, మనిషిని మనిషి నిలబెట్టడం జరుగుతోందని తెలియదు ..

'వాళ్ళకి తెలియదు...కాని తనకి తెలుసు... తెలిసి...తెలిసి

ఓటర్ల జాబితా....తెల్ల బట్టల రాయుళ్ళు....కుళ్ళుకాలవ....మురికి గాలి పలక రించే పాకలు....అన్నీ కళ్ళముందు కదిలాయి నరిసింహానికి.

చేతిలో ఉన్న కాయితాన్ని కసిగా, కోపంగా చిన్న చిన్న ముక్కల కింద చింపి, ఎదురుగా ఉన్న ఆ పెట్టె చుట్టూ చూశాడు....

ఆవేశం తీరలేదు నరిసింహానికి....అతని బలహీనమైన వేళ్ళ చివర గోళ్ళ కింద ఆవేశానికి, ఆ పెట్టెని గోళ్ళతో చీల్చి దానిలో ఉన్న కుళ్ళుని, కుట్రల్ని బద్దలు కొట్టాలనిపించింది....

"తొందరగా కానివ్వండి" అని తెరవెనకనుంచి ఓ గొంతు వినపడింది నరి సింహానికి.